నేను ఓటేస్తా.. మరి మీరు!

● వంద శాతం పోలింగ్‌పై అధికారుల ఫోకస్ ● ఓటు చైతన్యంపై వినూత్న ప్రచారం ● పలు చోట్ల సెల్ఫీ పాయింట్ల ఏర్పాటు ● కూడళ్లలో ఫ్లెక్సీలు

''నేను తప్పకుండా నా ఓటు హక్కు వినియోగించుకుంటా.. మరి మీరు! మన ఓటే ప్రజాస్వామ్యానికి బలం, ఓటరు జాబితాలో నా పేరు తనిఖీ చేసుకున్నా.. నాకు కొత్తగా ఓటు హక్కు వచ్చింది. ఈసారి నేను నా ఓటును సద్వినియోగం చేసుకోదల్చుకున్నా. కరీంనగర్ జిల్లాలో ఓటరునైనందుకు గర్విస్తున్నా.. ఈ నెల 30న నేను ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నా.'' అనే కొటేషన్లతో ఎన్నికల అధికారులు వంద శాతం పోలింగ్‌పై దృష్టి సారించారు. ప్రతి ఒక్కరూ ఆలోచించే విధంగా ఫ్లెక్సీలపై నినాదాలు రాయిస్తూ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా కూడళ్లు, జనావాస ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. వీటితోపాటు కొత్తగా సెల్ఫీ పాయింట్లు కూడా పలుచోట్ల ప్రారంభించారు. ఓటు సింబల్‌కు చిహ్నమైన చేతి చూపుడు వేలును పోలిన గుర్తులు తయారు చేసి ప్రదర్శిస్తున్నారు. వీటిలో యువతీ, యువకులు ఉండి సెల్ఫీలు దిగేలా రూపొందించి, జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. మొదటగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రారంభించిన సెల్ఫీ పాయింట్ సందర్శకులను విపరీతంగా ఆకర్షిస్తోంది. పోలింగ్ శాతం పెంచేందుకు ఇప్పటికే ఎన్నికల కమిషన్ శత విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. ఎనభై ఏళ్లు పైబడ్డ వృద్ధులు, 80 శాతానికి మించి అంగవైకల్యం ఉన్న వారిని గుర్తించి, వారి కోసం ఓట్ ఫర్ హోమ్ కార్యక్రమం ప్రారంభించింది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు చేసే వారు కూడా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించింది. పోలింగ్ రోజు ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగుల కోసం పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని కొనసాగిస్తుండగా, ప్రైవేటు ఉద్యోగులు కూడా పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకునే వీలు కల్పించింది. కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు గత నెల 31వ తేదీ వరకు అవకాశమిచ్చింది. యువ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు విద్యా సంస్థల్లో అవగాహన శిబిరాలు కూడా నిర్వహించింది. వివిధ రంగాలకు చెందిన సెలబ్రిటీలతో ఓటు హక్కు ఉపయోగంపై ప్రచార కార్యక్రమాలు చేపట్టింది. ఓటర్లను ఆకర్షించేందుకు మోడల్ పోలింగ్ బూతులు, వికలాంగులు, వృద్ధులు, మహిళలు, యువత కోసం ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసింది. అలాగే, పీఎస్‌లలో ఓటర్లకు అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నది. గతంలో తక్కువ పోలింగ్ శాతం నమోదైన పోలింగ్ బూతులను గుర్తించి, బీఎల్‌వోలతో ఇంటింటి ప్రచారం కూడా చేయిస్తున్నది. యువతను ఆకట్టుకునేందుకు సెల్ఫీ పాయింట్లు కూడా ఏర్పాటు చేయడంతో, మారుతున్న ఆధునిక పోకడలకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ కూడా కొత్త కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టి పోలింగ్ శాతం పెంచేందుకు విశేష కృషి చేస్తుండడం పట్ల జిల్లా ఎన్నికల యంత్రాంగంపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఏతావాతా వంద శాతం పోలింగ్ టార్గెట్‌తో ముందుకు సాగుతున్న ఎన్నికల అధికారులు లక్ష్యం సాధించేందుకు పోలింగ్ రోజు వరకు కష్టపడాల్సిన అవసరముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

కొత్త ఓటర్ల నమోదులో సక్సెస్ అయిన జిల్లా ఎన్నికల యంత్రాంగం, వంద శాతం పోలింగ్‌పై దృష్టి సారించింది. ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఇప్పటికే కళాబృందాల ద్వారా అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రచారం చేస్తుండగా, తాజాగా వినూత్న నిర్ణయాలు తీసుకుంటూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నది. అక్షరాస్యులతోపాటు నిరక్షరాస్యులను కూడా ఆకట్టుకునేందుకు కృషి చేస్తోంది. పలు రకాల కొటేషన్లు వినియోగిస్తూ ఆలోచింపజేయిస్తున్నది.

- కలెక్టరేట్, నవంబర్ 15

అభ్యర్థులూ.. జర జాగ్రత్త!

● ప్రచారంలో హద్దు మీరితే కేసులే
● వ్యక్తిగత దూషణలకు దిగితే చర్యలు తప్పవు

కలెక్టరేట్, నవంబర్ 15 : రాష్ట్ర శాసనసభకు ఈనెల 30న జరుగనున్న ఎన్నికల్లో భాగంగా ఇప్పటికే నామినేషన్లు పూర్తి కాగా, ఉపసంహరణల పర్వం కూడా ముగిసింది. రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు కూడా ఎన్నికల కమిషన్ గుర్తులు కేటాయించింది. జాతీయ, ప్రాంతీయ పార్టీల అభ్యర్థులతోపాటు స్వతంత్రులుగా బరిలో నిలిచిన వారు కూడా బుధవారం నుంచి తమ ప్రచారాన్ని ఉధృతం చేశారు. ఎన్నికల్లో గెలిస్తే ఆయా నియోజకవర్గాల ప్రజలకు తాము చేయబోయే సేవలతోపాటు, సెగ్మెంట్ అభివృద్ధిపై ఎవరికి వారే వ్యక్తిగత, పార్టీల మ్యానిఫెస్టోలతో పాటు హామీలు కూడా ప్రకటిస్తున్నారు. పల్లెలు, పట్టణాల్లో ప్రచారం చేస్తూ, తమదైన శైలిలో ముందుకెళ్తున్నారు. నియోజకవర్గాల్లో ఒక్కసారిగా ఎన్నికల వేడి పెరుగగా, అభ్యర్థుల హామీలు, వారి ప్రచార శైలితో పల్లెలు, పట్టణాల్లో ఓటర్లు కూడా వారికి బ్రహ్మరథం పడుతున్నారు. దీంతో, కొంతమంది రెట్టించిన ఉత్సాహంతో ఎన్నికల కమిషన్ గీసిన లక్ష్మణరేఖ కూడా దాటుతున్నారు. ఒకరిపై ఒకరు ఇష్టారాజ్యంగా ఆరోపణలు చేస్తూ, విమర్శలు గుప్పిస్తూ, తమకు తామే మైలేజీ తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక దశలో వ్యక్తిగత దూషణలకు కూడా దిగుతున్నారు. తమ ప్రసంగాలకు కుల, మతపరమైన అంశాలు కూడా జోడిస్తూ భావోద్రేకాలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారు. ఫలితంగా ప్రజలు వర్గాలుగా విడిపోతున్నారు. తద్వారా ఎన్నికల్లో సహజంగా ఉండే ప్రశాంతత చెదిరిపోతున్నది.

ప్రచార శైలిపై ప్రత్యేక నియమావళి

అభ్యర్థుల ప్రచార శైలిపై ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా ప్రవర్తనా నియమావళి రూపొందించి, కఠినంగా అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. అభ్యర్థులు కానీ, వారి అనుయాయులు కానీ, ఈసీ విధించిన నిబంధనలు విస్మరించి ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగానే ఫిర్యాదుల కోసం ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్‌తో పాటు ప్రత్యేకంగా సీ-విజిల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై ఆయా రాజకీయ పార్టీల నేతలకు, అభ్యర్థులకు పలుమార్లు జిల్లా ఎన్నికల అధికారులు అవగాహన శిబిరాలు నిర్వహించారు. అయినా, కొంతమంది అభ్యర్థులు ఈసీ మార్గదర్శకాలు పెడచెవిన పెట్టి, వ్యవహరిస్తున్నారని జిల్లా ఎన్నికల యంత్రాంగం పేర్కొనడం గమనార్హం. ఈ నేపథ్యంలో అభ్యర్థులు కింది మార్గదర్శకాలు గుర్తుంచుకుని, తమ ప్రచారం చేసుకోవాలంటూ ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు.

● కులాలు, జాతుల మధ్య మతపరమైన, భాషాపరమైన విద్వేషాలు సృష్టించేలా అభ్యర్థులు వ్యవహరించకూడదు.

● ప్రత్యర్థి పార్టీ విధానాలు, వారి కార్యకలాపాలపై మాత్రమే విమర్శలు చేయాలి.

● గతంలో మాదిరి ప్రార్థనా మందిరాలు, ఆలయాలను ప్రచారానికి వినియోగించుకోరాదు.

● పోలింగ్ సమయానికి 48 గంటల ముందు నుంచే బహిరంగ ప్రచారం, సభలు, సమావేశాలు నిలిపివేయాలి.

● అభ్యర్థుల ఇంటి ఎదుట వ్యతిరేక ప్రదర్శనలు చేపట్టడం, పికెటింగ్, ధర్నాలకు దిగడం ఈసీ మార్గదర్శకాలు ఉల్లంఘించినట్లే.

● తమ ప్రచారం కోసం బ్యానర్లు కట్టడం, పార్టీల జెండాలు పాతేందుకు సంబంధిత స్థలం, భవన యజమాని అనుమతి విధిగా తీసుకోవాలి.

● భౌతిక దాడులకు దిగడం కూడా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు దారి తీసినట్లే.

● నిషేదాజ్ఞలు, ఆంక్షలున్న ప్రదేశాల్లో సభలు, సమావేశాలు నిర్వహించకూడదు.

● సభల్లో మైకులు, లౌడు స్పీకర్ల వినియోగానికి ముందుగానే అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి.

● అభ్యర్థులు చేపట్టే ఊరేగింపులు, ప్రదర్శనల రూటు మ్యాపు ముందుగానే ఎన్నికల అధికారులకు, పోలీసులకు తెలపాలి.

● సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ సృష్టించకుండా అభ్యర్థులు ప్రచారం చేసుకోవాలి.

● ప్రచారంతో గానీ, సభలు, సమావేశాలతో గానీ సమస్యలు ఎదుర్కొంటే వెంటనే సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. దీంతో, సదరు అభ్యర్థులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

కొప్పులకు మద్దతుగా ప్రచారం

ధర్మారం,నవంబర్15: మండల కేంద్రంలో బుధవారం ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దుతగా పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. ఎస్సీ కాలనీ, ప్రెస్ కాలనీల్లో వారు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల మ్యానిఫెస్టో పత్రాలను వారు ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పూస్కూరు పద్మజ,వైస్ ఎంపీపీ మేడవేని తిరుపతి, ఎంపీటీసీ-1 తుమ్మల రాంబాబు,ఉప సర్పంచ్ ఆవుల లత పాల్గొన్నారు.

బరిలో 216 మంది

● ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 12 స్థానాల్లో ఖరారైన అభ్యర్థులు
● కరీంనగర్‌లో అత్యధికంగా 27
● మానకొండూర్‌లో అతి తక్కువగా 10 మంది పోటీ

కరీంనగర్, నవంబర్ 15(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీలో నిలిచిన అభ్యర్థుల సంఖ్య ఖరారైంది. వివిధ పార్టీలతో పాటు స్వతంత్రులుగా మొత్తం 216 మంది బరిలో నిలిచారు. కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 31 మంది నామినేషన్లు నిలువగా, నలుగురు ఉపసంహరించుకున్నారు. దీంతో ఇక్కడ ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా 27 మంది పోటీలో నిలిచారు. మానకొండూర్‌లో 13 నామినేషన్లను ఆమోదించగా, ఇందులో ముగ్గురు ఉపసంహరించుకోగా అత్యల్పంగా 10 మంది బరిలో నిలిచారు. చొప్పదండిలో 17 నామినేషన్లను ఆమోదించగా, ముగ్గురు ఉపసంహరించుకున్నారు. దీంతో పోటీలో 14 మంది ఉన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 8 మంది అభ్యర్థులు, రామగుండంలో ముగ్గురు, మంథనిలో ముగ్గురు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో పెద్దపల్లి బరిలో 17 మంది, రామగుండం నుంచి 23, మంథని నుంచి 21 మంది పోటీలో నిలిచారు. సిరిసిల్ల అసెంబ్లీ స్థానంలో 23 మంది అభ్యర్థులు నామినేషన్ వేయగా, ఇద్దరు ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం 21మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వేములవాడ నియోజకవర్గ అసెంబ్లీ స్థానంలో 22 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా, అందులో రెండు నామినేషన్లు తిరస్కరించారు. నలుగురు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకోగా 16మంది బరిలో నిలిచారు. జగిత్యాలలో 21 మంది నామినేషన్ దాఖలు చేయగా, 2 నామినేషన్లను అధికారులు రిజెక్టు చేయగా, నలుగురు ఉపసంహరించుకున్నారు. దీంతో పోటీలో 15 మంది నిలిచారు. కోరుట్లలో 25 మంది నామినేషన్లు వేయగా, 5 తిరస్కరించగా, మరో ఐదుగురు ఉపసంహరించుకున్నారు. దీంతో ఇక్కడ కూడా 15 మంది పోటీలో నిలిచారు. ధర్మపురిలో 18మంది నామినేషన్లు వేయగా, ముగ్గురు ఉపసంహరించుకున్నారు. దీంతో ఇక్కడ సైతం 15 మంది పోటీలో నిలిచారు.

కరీంనగర్ బరిలో 27 మంది

కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 31 మంది నామినేషన్లు నిలవగా మహ్మద్ షుక్రుద్దీన్, కొట్టె రమేశ్, కంది అశోక్‌రెడ్డి, గంగుల రజిని తమ నామినేషన్లను ఉప సంహరించుకున్నారు. దీంతో 27 మంది పోటీలో నిలిచారు. వీరిలో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్, నల్లాల శ్రీనివాస్ (బీఎస్పీ), పురమల్ల శ్రీనివాస్ (కాంగ్రెస్), బండి సంజయ్ (బీజేపీ) పోటీలో ఉండగా వివిధ రాజకీయ పార్టీల నుంచి అంబటి జోజిరెడ్డి, దుర్గాబాయి బంగారు, నర్మద తోటపల్లి, బండి శ్రీనివాస్, మోదుంపల్లి శ్రీకాంత్, మోహన్ దుర్గం, అఖిల్ సాహెద్ మహ్మద్ పోటీలో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా ఎల్లయ్య నగునూరి, కోట శ్యాంకుమార్, గవ్వల లక్ష్మి, గుర్రం కమలాకర్, గొర్రె తార, గొర్రె సంపత్ కుమార్, చీటి వెంకటరమణా రావు, దీటి సుధాకర్‌రావు, డాక్టర్ నగేశ్, పల్లెపు దేవరాజ్, డాక్టర్ పెంచాల శ్రీనివాస్, బబ్బన్, బెల్లపు కరుణాకర్, బండి కిశోర్‌రెడ్డి, మోహిన్ మెకానిక్, షఫి పోటీలో నిలిచారు.

మానకొండూర్‌లో 10 మంది

మానకొండూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పరిశీలన తర్వాత 13 నామినేషన్లను ఆమోదించారు. ఇందులో పట్నం శ్రీనివాస్, ఉప్పలేటి లక్ష్మణ్, ప్రభాకర్ మోరె (ముగ్గురు) నామినేషన్లు ఉపసంహరించుకోగా పది మంది బరిలో నిలిచారు. వీరిలో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎరుపుల బాలకిషన్, ఆరెపల్లి మోహన్(బీజేపీ), డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ (కాంగ్రెస్), నిషాని రాంచంద్రం(బీఎస్పీ)తో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన జక్కపల్లి గణేశ్, తోడేటి పవిత్ర, దుబ్బాసి మహేందర్, నిషాని కృష్ణ, బోగె పద్మ, స్వతంత్ర అభ్యర్థిగా శనిగరపు యువరాజ్ పోటీలో ఉన్నారు.

చొప్పదండిలో 14 మంది

చొప్పదండి నియోజకవర్గంలో పరిశీలన తర్వాత 17 నామినేషన్లను ఆమోదించారు. అంజయ్య కల్లెపల్లి, తడగొండ మల్లేశం, నాగిశేఖర్ (ముగ్గురు) నామినేషన్లు ఉప సంహరించుకున్నారు. పోటీలో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తోపాటు కొంకటి శేఖర్ (బీఎస్పీ), మేడిపల్లి సత్యం (కాంగ్రెస్), శోభ గాలన్న బొడిగె (బీజేపీ) పోటీలో ఉన్నారు. వివిధ రాజకీయ పార్టీల నుంచి జంగం సాధన, దుంపాల నర్సింహబాబు, బంగారి మధవ, బెజ్జంకి ప్రశాంత్ కుమార్, లక్కం అజయ్, విజయ్‌కుమార్ ఎంఎస్, అక్కెనపల్లి సతీశ్, కల్లెపల్లి విజయరాజ్, గౌరు అజయ్‌కుమార్, దాసరి విద్యాసాగర్ పోటీలో ఉన్నారు.

హుజూరాబాద్ నుంచి 22 మంది

హుజూరాబాద్ నియోజకవర్గంలో పరిశీలన తర్వాత 25 మంది మిగిలారు. వీరిలో పైడిపల్లి అంజయ్య, కొత్తూరి రమేశ్, బండి శ్రీనివాస్ (ముగ్గురు) నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. పోటీలో బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డితోపాటు సిట్టింగ్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్(బీజేపీ), ప్రశాంత్ పల్లె (బీఎస్పీ), వొడితల ప్రణవ్ (కాంగ్రెస్)తోపాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన గంగారపు తిరుపతి, చిలువేరి రమేశ్, చింత అనిల్‌కుమార్, తిరుపతి బావు, దేవునూరి శ్రీనివాస్, మొలుగు వెంకటేశ్, మౌటం సంపత్, రమేశ్‌బాబు శనిగరపు, వీరస్వామి గౌడ్ జక్కె పోటీలో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా అనిల్ గౌడ, అబ్బు మహిపాల్‌రెడ్డి, ఇమ్మడి సతీశ్, గట్టయ్య యాదవ్ బరిగు, చల్ల తిరుపతి రెడ్డి, బసాడి ముకుంద రావు, మాధవ రాణి బరిగే, రాపోల్ రాంకుమార్ బరద్వాజ్, శ్రీకాంత్ సిలివేరు పోటీలో ఉన్నారు.

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

కలెక్టరేట్, నవంబర్ 15 : శాసనసభ ఎన్నికల్లో భాగంగా కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 27 మంది బరిలో నిలిచారు. వీరిలో నలుగురు ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులుండగా, ఆరుగురు రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల నుంచి బరిలోకి దిగిన వారున్నారు. మిగతా 17 మంది స్వతంత్రులుగా రంగంలో నిలిచారు. వీరందరికీ గుర్తులు కేటాయంచారు. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్‌కు కారు, బీఎస్పీకి ఏనుగు, కాంగ్రెస్‌కు చేయి, బీజేపీకి కమలం కాగా, రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులకు సింహం, ఈల, పిల్లల గోవి, కుండ, టార్చిలైట్, మంచం, స్వతంత్రులకు ల్యాప్‌టాప్, ఉంగరం, ఫుట్‌బాల్, బ్యాట్, రోడ్డు రోలర్, ఓడ, గాజు గ్లాసు, బెల్ట్, అగ్గిపెట్టె, గన్నాకిసాన్, బుడగ, చపాతీ రోలర్, కాలిక్యులేటర్, కెమెరా, వజ్రం, ఫ్యాన్, హెల్మెట్ కేటాయించారు. జాతీయ, రిజిస్టర్డ్ పార్టీలకు గుర్తులుండగా, స్వతంత్రులకు మాత్రం ఎన్నికల కమిషన్ సూచించిన గుర్తులను ఆల్ఫాబెటికల్ పద్ధతిలో కేటాయించారు.